క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డి పాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దు



పర్యావరణ జీవనశైలిపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: బహిరంగ ప్రదేశాలలో, రహదారులపై చెత్తవేయవద్దని.. ప్రతి ఒక్కరూ విధిగా చెత్తను స్వచ్ఛ ఆటోలలోనే వేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురంలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఏర్పాటు చేసిన పర్యావరణ జీవనశైలిపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గణేశ్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి బోనాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో బొడ్రాయి పండుగ సందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాజేంద్రనగర్, శాంతినగర్, హనుమాన్‌నగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, మాణిక్యమ్మ కాలనీ, వేంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో బోనాలను బొడ్రాయి వద్దకు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. 2010లో నిర్వహించిన ఈ పండుగ అనంతరం ప్రస్తుతం రెండు రోజుల పాటు ఘనంగా బొడ్రాయి పండుగ నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

శంషాబాద్: పట్టణంలోని గొల్లపల్లి హనుమాన్ సమేత ఇష్టకామేశ్వరీ, కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ అష్టమ వార్షికోత్సవ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో రుద్రహోమం, గోపూజ, మహామంగళహారతి, అవాహిత దేవతార్చనలు, వేదపారాయణం, కుంకుమార్చన, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జిట్ట సిద్దులు దంపతులు, నర్సింహారెడ్డి, చంద్రాచారి, యాదయ్య, వెంకటేష్‌గౌడ్, పాండు, బాబు, బిక్షపతి, బాలయ్య, రాముచారి, నరేందర్, భాస్కర్, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, నవీన్, నర్సింహ, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

- ఉప్పరిగూడలో రసాభాసగా సమావేశం
- సర్పంచ్‌ను నిలదీసిన గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. మండల పరిధిలోని ఉప్పరిగూడలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణంపై సర్పంచ్ బూడిద రాంరెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రస్తుతం రోడ్డు వేసి తర్వాత బ్రిడ్జి నిర్మాణం చేపడతామని సర్పంచ్ ప్రజలకు వివరించారు. సాగర్ రహదారి నుంచి ఉప్పరిగూడ వరకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించారని త్వరలోనే నిధులు మంజూరు అవుతయన్నారు. ఇదే వ్యవహారంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు భిన్నస్వరం వినిపించారు. గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వధువుకు కానుక



వివాహకానుక అందిస్తున్న గోదాదేవిసత్యం దంపతులు

ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో రాములమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తె స్వప్నకు సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు వివాహ కానుకగా రూ.10,116 అందించారు. శెట్టిపల్లి సర్పంచ్‌గా ఎన్నికై నప్పటి నుంచి గ్రామంలో వివాహం చేసుకునే అమ్మాయిలకు రూ.10,116 చొప్పున ఆమె వివాహకానుక అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, నాయకులు వెంకటయ్య, పర్వతాలు, యాదయ్య, నర్సింహ, మహేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సుకే సంక్షేమ పథకాలు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న సబితారెడ్డి, అనితారెడ్డి

మహేశ్వరం: పేదలకు శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ వినూత్న పథకాలు చేపడుతున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాలులో 72మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, జీఓ 58,59కు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం పదో ఏట అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 2 నుంచి నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేద, మధ్య తరగతి ప్రజలకు 58,59 జీఓలతో ఆస్తి హక్కులు కల్పిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మండలంలోని ఇప్పటి వరకు 2,243 లబ్ధిదారులకు సుమారు రూ.19 కోట్లను అదజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, ఆర్ఐలు పావని, స్వర్ణకుమారి, తుక్కుగూడ కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్థల కేటాయింపునకు వినతి

హర్షగూడ గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి కార్యాలయం నిర్మాణం చేసుకోవడానికి స్థలం కేటాయించాలని మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు వారు ఆదివారం క్యాంపు కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని హర్షగూడ గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఉప సర్పంచ్ జె.రవి నాయక్, ఎంపీటీసీ సభ్యుడు విజయ్ నాయక్, సంఘం సభ్యులు, వార్డు సభ్యులు మున్నా నాయక్, శంకర్ నాయక్, తారాసింగ్, జగన్, లాల్ సింగ్, సుజిత, సుజాత, అనసూయ, సంగీత, యాదయ్య, రాజు, అజయ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

మండల పరిధిలోని పెండ్యాల గ్రామానికి చెందిన బ్యాగరి రామచంద్రయ్యకు గుండె అపరేషన్ కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.75లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని ఆదివారం ఆమె బాధితుడికి అందజేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి సీఎం సహాయ నిధి, ఎల్‌ఓసి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల సర్పంచ్ మంత్రి సంధ్యా రాజేష్, ఉప సర్పంచ్ ఎండి.గౌస్, జెడ్పీటీసీ సభ్యుడు యాచారం జంగయ్య, మాజీ ఉప సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నరేశరెడ్డి,ఎండి.షరీఫ్,విజయ్,శివ కుమార్, అశోక్‌రెడ్డి, అంజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.43.58 కోట్ల నిధులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి హెచ్‌ఎండీఏ నుంచి రూ.43.58 నిధులు మంజూరు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్‌లో 62 పనులకు గాను రూ.17.68కోట్లు జల్‌పల్లి మున్సిపాలిటీలో 56 పనులకు రూ.22.40కోట్లు, తుక్కుగూడ మున్సిపాలిటీలో 14 పనులకుగా రూ.3.50కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో కనీస వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గులాబీ గూటికి కమలం కార్యకర్తలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ ఇందిరానగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం అపార్ట్‌మెంట్లలో నివాసముండే బీజేపీకి చెందిన 30 మంది కార్యకర్తలు ఆదివారం మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చేరిన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మంత్రికి సహకరించేందుకే బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బద్రమోని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా మదన్మోహన్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న మదన్మోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

హుడాకాంప్లెక్స్: రోలర్ స్కేటింగ్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరకంటి మదన్మోహన్‌రెడ్డి ఎన్నికయాయరు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో 2023–27 వరకు ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా టంగుటూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా రవి, ఎడ్ల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య, జాయింట్ సెక్రటరీలుగా మహేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్, నరేశ్, కోశాధికారిగా వట్టి శ్రీను, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వి.రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, లింగస్వామి, సూర్యప్రకాశ్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్ క్రీడ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కమిటీ ఎన్నికల అధికారిగా ధారావత్‌రవి, పరిశీలకులుగా ఎం.రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కె.యాదయ్య, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఎం.కృష్ణమూర్తిలు ఉన్నారు.

2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

మీర్‌పేట: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 2న నిర్వహించే ఈ క్విజ్ పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆదివారం మీర్‌పేట మంద మల్లమ్మ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఇన్‌చార్జి నయీం సద్దాం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు 16 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు 766 189 9899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమ అంశాలపై 60 ప్రశ్నలకు 60 నిమిషాల నిడివి ఉంటుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లను అందజేస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 మందికి ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్ వాచ్‌లు, ఇయర్‌ప్యాడ్‌లు, హార్డ్‌డ్రైవ్‌లు, పవర్‌బ్యాంక్‌లను ఇస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ పరిధిలో ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీని బహుమతిగా అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పెండెం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్, కార్యదర్శి అమీర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల అధ్యక్షులు దీక్షిత్, నందకిషోర్, కౌశిక్, సాహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి

ఆమనగల్లు: మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం పోచమ్మ దేవతను వేద పండితుల మంత్రోచ్చరనల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, పోలెపల్లి సర్పంచ్ బాలరాం, ఎంపీటీసీ సభ్యుడు దోనాదుల కుమార్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, ఉపసర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుక్కమ్మ, స్థానిక నాయకులు లాలయ్య, వెంకటయ్య, జంతుక వెంకటయ్య, జంగయ్య, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళలను, కళాకారులను కాపాడుకుంటాం



కళాకారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: అంతరించి పోతున్న కళలను, కళాకారులను కాపాడుకుంటామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ కళాబృందం మహిళా సభ్యులచే త్వరలో నిర్వహించబోయే గ్రామీణ కళావేడుకలకు సంబంధించి ఆదివారం రూ.25వేల చేయూతనందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, కళాబృందం సంభ్యులు పద్మ, జంగమ్మ, రాములమ్మ, ప్రేమలత, శ్రీలత, పల్లవి, పండు, రమ్య, స్వాతి, ప్రవళిక ఉన్నారు.

‘ఎమ్మెల్యే అసమర్థ పాలన వల్లే సమస్యలు’



హస్తినాపురంలో పర్యటిస్తున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

హస్తినాపురం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అసమర్థ పాలన వల్లే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వరద ముంపు ప్రాంతాలైన శ్రీరమకాలనీ, భీమానగర్, బాలాజీనగర్, వందనాపురికాలనీ, గ్రీన్ ల్యాండ్స్ కాలనీలలో స్థానికులతో కలిసి అసంపూర్తిగా నిలిచిపోయిన నాలాపనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిలిచి పోయిన నాలా పనులను అధికారులు పూర్తిచేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన బాక్స్ డ్రైన్ పనులను కేవలం జెడ్పీ రోడ్డు నుండి వనపురి కాలనీ వరకు కేవలం 500 మీటర్ల వరకే పరిమితం అయ్యిందని అన్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి అధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించారు. కార్యక్రమంలో గౌని వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రం విధానాలతో ఎంతో నష్టం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాయకులు

హస్తినాపురం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఎంతో నష్టం జరుగుతోందని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని రంగాలలో పనిచేసే కార్మికులకు ప్రస్తుతం కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నందనవనం కాలనీలో ఆలేట ఎల్లయ్య అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలల్లో బీజేపీ ప్రభుత్వానికి ఓటమి తప్పదనే భయంతో కార్మికుల ఐక్యతను పక్కదారి పట్టించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సాంకేతిక విప్లవ వారధి.. రాజీవ్‌గాంధీ

మేయర్ చిగురింత పారిజాత



బడంగ్‌పేట: రాజీవ్ గాంధీ వర్ధంతిలో పాల్గొన్న మేయర్ పారిజాత, కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: భారత దేశానికి సాంకేతిక విప్లవానికి పునాది వేసిన గొప్ప మహానుభావుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం బడంగ్‌పేట చౌరస్తాలో రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. ఆయన దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడం సంతోష, నవారు మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, విజయ్‌కుమార్, కార్పొరేషన్ అధ్యక్షుడు అమృతానాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజీవ్ అడుగుజాడల్లో నడవాలి

పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్మేటి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుల మాలలు వేసి నివాళి అర్పించారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు అహ్మద్‌బూమ్, పార్టీ మహేశ్వరం మండలం అధ్యక్షుడు కాకి ఈశ్వర్, నాయకులు వంగేటి మధుసూధన్‌రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి, నూన్యనాయక్, సుధాకర్, సంజీవ, మల్లేశ్, గోవర్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కందుకూరు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దంతోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పీహెచ్‌సీలో రోగులు, సిబ్బందితో పాటు సమీప ఇటుక బట్టీల్లోని కూలీలకు పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీతోనే దేశంలో కంప్యూటర్ సాంకేతికత ప్రారంభమైందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి, నాయకులు మహేశ్, శ్రీకాంత్, శివ, ప్రణయ్ పాల్గొన్నారు.



కందుకూరు: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నర్సింహాచారి తదితరులు



బడంగ్‌పేట: మల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న అమరేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో యువకులు చేరిక



యువకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రణధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైతన్యపురిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. కర్ణాటకలో ఎన్నికల సమయంలో ఇచ్చి ఐదు హామీలను ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే వాటి అమలుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్వర్వులు జారీ చేశారని అన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దళిత బంధులో తమకు అన్యాయం చేశారని, తన అనుచరులకు డబ్బులు ఇచ్చిన వారికి దళితబంధు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మతిన్, షరీఫ్, మాతంగి యాదగిరి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

రాజేంద్రనగర్: రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగలను పర్మనెంట్ చేయాలని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఆహ్వాన సంఘం కోశాధికారి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ మూడో మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వ్యవస్థ ఉండదని.. అందరినీ పర్మనెంట్ చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ అమలుకు నోచలేదన్నారు. మున్సిపల్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగ, కార్మికులకు 8 గంటల పని విధానం అమలు కావాలన్నారు. పర్మనెంట్ చేసే వరకు కార్మికులకు కనీస వేతనం రూ.26,000లకు పెంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి మే డే సందర్భంగా రూ. వెయ్యి పెంచడం దారుణమన్నారు. పారిశుధ్య కార్మికులకు పర్మినెంట్ చేయకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇంటి జాగా ఉన్న వారికి రూ.10 లక్షల రుణ సదుపాయం కల్పించాలన్నారు. మరణించిన కార్మికులకు రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెంచాలన్నారు. ఒడిశా తరహాలో తెలంగాణలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మిక సిబ్బందిని పర్మనెంట్ చేయాలని తదితర డిమాండ్లను సాధించుకోవడం కోసం జూన్ 6న మేడ్చల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సభలను మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్, శ్రీను, శ్యామలమ్మ, సరస్వతీ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వనంపల్లి జైపాల్ రెడ్డి